


# అమర్‌దీప్

హర్యానాలోని పానిపట్ జిల్లా లోతట్టున ఉన్న 'బాంద్' గ్రామంలో అందరూ మధ్యతరగతి కుటుంబాల వారే. సంపన్నులు ఎవరూ లేరు.

ప్రేమ్‌సింగ్ ఒక సాధారణ రైతు.

సాదాసీదా మనిషి. ఎవరి జోలికీ పోయే వాడు కాదు. తన పనేమో తనేమో. కొడుకు అమరదీప్‌సింగ్ ఉత్సాహానికి మారుపేరు. ఆట పాటల్లో పైచెయ్యి, ధృఢంగా అందర్నీ ఆకట్టుకుంటూ ఉంటాడు.

పొరుగింటి వాళ్ల కిటికీలోంచి, టెలివిజన్‌లో వచ్చే రిపబ్లిక్‌డే పెరేడ్‌లో సైనిక కవాతుని ఎంతో ఆసక్తిగా చూస్తూ, ఆలివ్ ఆకుపచ్చ రంగు దుస్తుల్లో ఉన్న సైనికుల్ని తన సోదరులుగా భావిస్తుండేవాడు. వాళ్లలో తనూ ఒకడు కావాలని కలలు కనేవాడు. తనకా భాగ్యం కలిగించమని భగవంతుని పదేపదే వేడుకునేవాడు అమర్‌దీప్.

అతని ప్రార్ధన ఫలించినట్లు మిలట్రీ రిక్రూట్‌మెంట్‌లో సెలక్టయ్యాడు. ఆరోజు

అతని ఆనందానికి అవధుల్లేవు. ఇంట్లో అందరికీ మిఠాయిలు పంచాడు. ఇరుగుపొరుగువారికి, మిత్రుల కుటుంబాలకు కూడా మిఠాయిలు పంచాడు. అందరూ అభినందించారు. పెద్దలు 'యశస్వీభవ' అని ఆశీర్వదించారు.

ట్రయినింగ్ పూర్తికాగానే 16 గ్రెనెడియర్స్‌లో అతనికి పోస్టింగ్ వచ్చింది. లక్ష్యం మీద గురి తప్పకుండా తుపాకీ తూటా పేల్చడంలో అతను సిద్ధహస్తుడు. ఈ ప్రతిభ గమనించిన అధికారులు అతన్ని గస్తీ బృందంలో నియమించారు. చొరబాటుదారుల్ని పసిగట్టడం, కాల్పులు జరిపి వారిని వెనక్కి మళ్లించడం, లేదా మట్టుబెట్టటం గస్తీ బృందం విధులు.

సిపాయిలు దేశమాతకి ముద్దు పాపాయిలు. ప్రాణాలను పణంగా పెట్టి, మన సరిహద్దుల్ని సదా రక్షిస్తూంటారు. వారి వీరగాథలు యువతకి ఆదర్శం, స్ఫూర్తిదాయకం కావాలి.

ఈ కథలు వాస్తవ సంఘటనల నేపథ్యంతో రచించబడ్డాయి. రచయిత శ్రీ కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ 1964 నుంచి 1980 వరకు వైమానిక దళంలో పనిచేసిన కాలంలో స్వయంగా రెండు యుద్ధాలలో పాల్గొన్నారు. మిలట్రీ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న అనేక మంది యుద్ధవీరుల విజయగాథల గురించి వివరాలు సేకరించారు. యుద్ధరంగం వేదికగా, దేశభక్తి ఊపిరిగా, త్రివిధ దళాల యుద్ధవీరులు సజీవ పాత్రలుగా వెలువడుతున్న ఈ కథలు 'కథాకేళి' పాఠకులకు ప్రత్యేకం.

14 వేల అడుగుల ఎత్తున ఉన్న కార్గిల్ శిఖరాల మీద అమర్‌దీప్‌సింగ్, సహచరుడు హవల్దార్ జైప్రకాష్‌లు శత్రువుల కదలికల్ని నిశితంగా గమనిస్తూ, ఏమాత్రం సందేహం ఉన్నా తుపాకీలకు పని చెబుతున్నారు. గస్తీ బృందాలు తుపాకీ వేటు దూరం కొలతగా విధులు నిర్వహిస్తున్నాయి.


1999వ సంవత్సరం మే 8వ తేదిన చొరబాటుదారులు తెగబడ్డారు. గస్తీ బృందాలలో ఆరుగురు సైనికులు ప్రాణాలు కోల్పోవడంతో మిగతావారు అగ్గిలో గుగ్గిలంలా మండిపడి, శత్రువుల మీద తీవ్రంగా ఎదురుదాడి చేసారు. అవతల చొరబాటుదారుల సంఖ్య అంతకంతకూ అధికమౌతోంది.

అమర్‌దీప్‌సింగ్‌కి భోజనం చేసే విరామం కూడా లభించలేదు. ఒక పక్క తూటాలు గుప్పిస్తూనే, సహచరుడు జైప్రకాష్‌ని బలవంతంగా భోజనం చేయడానికి పంపాడు. అది కూడా పేరుకి భోజనం. యుద్ధరంగంలో భోజనం కేవలం ప్రాణాలు నిలబెట్టుకోవటానికి, శక్తిని కాపాడుకోవటానికీ పనికివస్తుంది. ఆదరా బాదరా భోజనం ముగించి జైప్రకాష్ తిరిగివచ్చి అమర్‌దీప్‌ని భోజనం చెయ్యమన్నాడు. కానీ, అవతలి నుంచి వస్తున్న తూటాల జడివానలో ఆ అవకాశం లభించటం అసాధ్యంగా ఉంది. స్థావరాన్ని వదిల్తే పట్టు పోయినట్లే. అందుకే పట్టుదలగా అలాగే ఉన్నాడు.

'పోస్ట్' అన్న కేకవిని ప్రేమ్‌సింగ్ ఆతృతగా బయటకు వచ్చాడు. కొడుకు అమర్‌దీప్ రాసిన ఉత్తరం చూడగానే ప్రేమ్‌సింగ్ మొహం సంతోషంతో వికసించింది. ఉత్తరంతోబాటు రెండు వేల రూపాయల మనియార్డరు కూడా వచ్చింది. సంతకం చేసి డబ్బు తీసుకుని, పోస్టుమాన్‌కి కృతజ్ఞతగా పదిరూపాయలిచ్చాడు.

**కాటూరు రవీంద్రత్రివిక్రమ్**

ఇంట్లోకి వస్తుంటే "అబ్బాయి ఉత్తరమేనా?" కుతుహలంగా



అడిగింది భార్య. "అవును - అబ్బాయి ఉత్త రమే..." తనలో తాను చదువు కుంటుండగా కవరులోంచి ఫొటో జారిపడింది. చేతిలోకి తీసుకుని చూసాడు. తుపాకీ ఎక్కుపెట్టి మోకాలి మీద కూర్చున్న భంగిమతో అమర్‌దీప్ చూడ ముచ్చటగా ఉన్నాడు. వెనకవైపు సరిహద్దు సీమలు కనిపిస్తున్నాయి.

"మీలో మీరు చదువుకోకపోతే పైకి చదివి విన్పించొచ్చుగా" నిష్ఠూరం కలిసిన ఆతృతతో అంది ఇంటావిడ. ప్రేమ్‌సింగ్ నవ్వి "సరే- అయితే విను" అంటూ మొదలునుంచి చివరి దాకా చదివి వినిపించాడు. ఫొటో చూపించా డు. కొడుకు ఫొటోకేసి మురిపెంగా చూసిందా తల్లి.

"ఎంత దూరాన ఉన్నా ఇంటిని మర్చిపోడు బిడ్డ. ఈ మాటు శలవులమీద వచ్చినప్పుడు గోడలకి చెక్కసున్నం చేయిస్తానని రాసాడు. విన్నావు కదా?"

"విన్నానులెండి! అయినా వాడు హఠాత్తుగా వచ్చి మనల్ని ఆశ్చర్యపెట్టాటానికిష్టపడతాడే తప్ప, ఎప్పుడు వచ్చేదీ స్పష్టంగా రాయడు కదా? అప్పటిదాకా ఈ పని ఆపటం దేనికి? డబ్బు పంపించాడు కదా? మీరే చేయించండి."

"వద్దు-అలా చేస్తే అబ్బాయి బాధపడతా డు. మాట ఇచ్చాడంటే ప్రాణం పోయినా తప్ప డు. వాడికి మా నాన్న పోలిక వచ్చింది. ఆయ నా అంతే. మాటంటే మాటే!"

"పోన్లెండి. మీ పోలిక రాలేదు నయం. మీరు అన్నీ వాయిదాలు వెయ్యటమేగా?" ఎత్తి పొడిచింది.

ప్రేమ్‌సింగ్ మందహాసం చేసాడు. ప్రేమ్ సింగ్ చిన్నకొడుకులిద్దరూ అన్న రాసిన ఉత్తరం లోని విశేషాలు తండ్రిని తరచి తరచి అడిగి తెలుసుకున్నారు.

వాళ్ల ఇద్దరి మనస్సులో ఒకే భావన. తాము కూడా అన్నలాగానే ధృఢంగా ఎదిగి, ఆర్మీలో సిపాయిలుగా చేరి సరిహద్దుల్ని కాపాడాలి.

★ ★ ★

"అమర్‌దీప్... నీకు తూటా గాయాలయ్యాయి. రక్తం కారిపోతుంది. ఈ పరిస్థితుల్లో నువ్వు త్వరగా వైద్యసాయానికి వెళ్లాలి. నా మాటవిని వెళ్లు..." జె.సి.వో. (జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్) విక్రమ్‌సింగ్ గట్టిగా కోరాడు.

"లేదు సుబేదార్‌సాబ్ – నేను కూడా వెళ్లిపోతే శత్రువుల్ని ఆపేదెవరు? వాళ్లు చూడండి. జడివానలా తూటాలు విరజిమ్ముతూ ఏమాత్రం అవకాశం దొరికినా మన స్థావరాలు చేజిక్కించుకునేందుకు తహతహలాడుతున్నారు... మీరు రిలీవరు కోసం అడగండి. నా బాధ్యత రిలీవరుకి అప్పగించి వైద్యానికి వెళతాను..."

"శత్రువులు వైర్‌లెస్‌ని జామ్ (నిరుపయోగం) చేస్తున్నారు. సంకేతాలు అందటం లేదు... చాలా సేపటినుంచీ ప్రయత్నిస్తున్నాను..."

"పిరికి పందలు! ఇలాంటి చౌకబారు పనులు చెయ్యటం తప్ప సాహసంగా పోరాడే ధైర్యం వాళ్లకెక్కడిది?"

అంతలో మళ్లీ శత్రువులు కాల్పులు ప్రారంభించారు.

అమర్‌దీప్ ఎదురుకాల్పులు సాగించాడు.

హవల్దార్ జైప్రకాష్ కూడా గాయాలతోనే శత్రువుల్ని నిరోధిస్తున్నాడు. సుబేదార్ విక్రమ్‌సింగ్ వారితో జతకలిసి తన చేతిలోని మెషిన్ గన్‌కి పనిపెట్టాడు.

గాలిని చీలుస్తూ తూటాలు స్వేచ్ఛగా అటూ ఇటూ దూసుకుపోతూనే ఉన్నాయి. అమర్‌దీప్ వంట్లో శక్తినంతా కూడ దీసుకుని, గురిచూసి శత్రువుల మీదకు తూటాలు పేలుస్తూనే ఉన్నాడు.

మే 13వ తేదీ–1999వ సం॥రం.

మధ్యాహ్నం ఎండ తీవ్రంగా ఉంది. బాంద్ గ్రామంలోకి మిలటరీ ట్రక్కు వస్తుంటే, గ్రామస్థులు ఆశ్చర్యంగా చూస్తున్నారు. అది నేరుగా వెళ్లి ప్రేమ్‌సింగ్ ఇంటి ముందు ఆగింది. ట్రక్కు శబ్దం విని ఇంట్లో వాళ్లు ఆతృతగా బయటకు వచ్చారు. ట్రక్కులో వచ్చిన ఆర్మీ సిపాయిలు త్రివర్ణ పతాకం చుట్టబడిన శవపేటికను జాగ్రత్తగా క్రిందకు దింపి, ఆ ఇంటి అరుగుమీద ఉంచారు. ఒక ఉత్తరం ప్రేమ్‌సింగ్ చేతికిచ్చారు. అందులో అమర్‌దీప్ సాహసకృత్యాల వివరణతో బాటు, మరణవార్త, సానుభూతి వచనాలు ఉన్నాయి. క్రింద కమాండర్ సంతకం ఉంది.

శవపేటిక తెరిచి చూసాడు ప్రేమ్‌సింగ్. ఆ వీరపుత్రుడి మొహం మీద ఎంతో తృప్తీ, ఆనందం స్థిరముద్రగా కనిపిస్తున్నాయి. వచ్చిన సిపాయిలు 'శాల్యూట్' చేసి శలవు తీసుకు వెళ్లిపోయారు. 'బాంద్' గ్రామవాసులు ఆ వీర కిశోరానికి ఘనంగా అంత్యక్రియలు నిర్వర్తించారు.

ప్రేమ్‌సింగ్ కొడుకు గుర్తుకొచ్చినప్పుడల్లా అమర్‌దీప్ రాసిన చివరి ఉత్తరం చదువుతుంటాడు. చిన్న కొడుకులిద్దరూ ఉదాసీనంగా వింటూ ఉంటారు. ఫొటోలో అన్నగారిని చూసుకుంటూ – ఎప్పుడు ఎదిగి ఆర్మీలో చేరతామా అని ఆ ఇద్దరూ ఎదురు చూస్తున్నారు... వారిలో అమర్‌దీప్ స్ఫూర్తి ఆరని దీపంలా వెలుగుతూనే ఉంది.

*(ఇండియా టుడే సౌజన్యంతో)* ●